## పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఎస్‌పి శ్రీనివాసరావు



ప్రజాపక్షం/మెదక్ : మెదక్ జిల్లాలో పెండింగ్ కేసుల పరిష్కారం, దర్యాప్తు వేగవంతంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్‌పి డి. వి. శ్రీనివాస రావు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెల రోజుల క్రైమ్ రివ్యూ సమావేశంలో కేసుల పురోగతి, మిస్సింగ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, సైబర్ నేరాలు,ట్రాఫిక్ అమలు చర్యలపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఎస్‌పి మాట్లాడుతూ సీసీటీఎస్ఎస్ డేటాను సకాలంలో నవీకరించాలని, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డయల్100 ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్, ఫేక్ నెంబర్ ప్లేట్లపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందింకి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందిచారు. ఈ సమావేశంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్రబోస్, సీఐలు రాజశేఖర్ రెడ్డి, రేణుక రెడ్డి, సందీప్ రెడ్డి, రంగా కృష్ణ, సైదా, మహేష్, వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బైక్‌పై పర్యటిస్తూ సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే



ప్రజాపక్షం / పెంబి : మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన ఇటిక్యాల గుమ్మెన, యంగ్లాపూర్, చాకిరేవు, దొండరి, గ్రామాల్లో ఎమ్మెల్యే బొజ్జు పటేల్, కలెక్టర్ గురువారం పర్యటించారు. గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో బైక్‌పై వెళ్లి ఆయా గ్రామాల్లో సమస్యలు తెలుసుకున్నారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## అంగన్‌వాడీలకే ప్రీప్రైమరీ బాధ్యతలు అప్పగించాలంటూ వినతి



ప్రజాపక్షం/భీమ్‌గల్ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ప్రీప్రైమరీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని గతంలో మాదిరిగా పూర్వ ప్రాథమిక విద్య బాధ్యతలను అంగన్‌వాడీ కేంద్రాలకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా సంఘాల నాయకులు ఎంఇఒ, తహసీల్దార్లకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అంగన్‌వాడీల వ్యవస్థ తీవ్రంగా దెబ్బ తింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దశాబ్ధాలుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారానే నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం అందుతుందన్నారు. పాత పద్ధతిలోనే అంగన్‌వాడీ కేంద్రాలను కొనసాగించని పక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడుతామన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేయాలి



ప్రజాపక్షం/ మెదక్ : తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నా వారందరినీ గుర్తించి తగిన న్యాయం చేయాలని మెదక్ జిల్లా ఉద్యమకారుల సమన్వయ కమిటీ సమన్వయకర్తలు బి. కొండల్ రెడ్డి, సడమెల యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినా ఉద్యమకారుల గుర్తింపు విషయంలో నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మెదక్‌లో తెలంగాణ అమరవీరుల స్థూపం ఏర్పాటు చేయడం, ఉద్యమంలో పాల్గొన్న కళాకారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ కార్మికులు, జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించడం, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం, 1969 తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయడం వంటి తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో భూపాల్ రెడ్డి, జెల్ల సుధాకర్, మల్లికార్జున్ గౌడ్, శ్రీకాంత్, రూపేష్, మనోహర్, శివాజీ, జర్నలిస్టులు కంది శ్రీనివాస్ రెడ్డి, శంకర్ దయాల్ చారి, బొందుగుల నాగరాజు, సురేందర్ రెడ్డి, నాయకులు ఫజల్ అహ్మద్, గట్టేష్, బిమరి శ్రీనివాస్, టీచర్లు సంగయ్య, యాదగిరి, మల్లారెడ్డి, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, ఆర్టీసీ, జర్నలిస్టు, ప్రజా సంఘాల నాయకులు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజూరాలో ఒకరు ఆత్మహత్య

ప్రజాపక్షం / లోకేశ్వరం : లోకేశ్వరం మండలం రాజూరా గ్రామానికి చెందిన తమ్మరాశి రాజన్న ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒంటరితనంతో గత 20 సంవత్సరాల క్రితం భార్య చనిపోవడం మరియు కొడుకు విదేశాలకు వెళ్లడంతో మనస్థాపానికిలోనై, జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ అశోక్ తెలిపారు

## రేషన్‌బియ్యం తరలిస్తున్న ఆటో పట్టివేత

ప్రజాపక్షం/శివ్వంపేట : అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను పోలీసులు పట్టుకున్న ఘటన శివ్వంపేట మండలం లింగోజిగూడ తండాలో చోటుచేసుకుంది. ఎస్ఐ మదుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం లింగోజిగూడ తండాకు చెందిన మలావత్ పాండు తన ఆటోలో పరిసర ప్రాంతాల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తూ ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న కార్మికులకు అధిక ధరలకు విక్రయిస్తూరనే నమ్మదగిన సమాచారం మేరకు గురువారం ఉదయం పోలీసులు ఎస్ఐ మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. పాండు తన ఆటోలో 8రేషన్ బియ్యం సంచులు తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సివిల్ సప్లై అధికారులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ఓటు హక్కుపై దాడిని అడ్డుకుందాం

మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



ప్రజాపక్షం / మందమర్రి : ఓటర్ల ప్రత్యేక సవరణ జాబితా (ఎస్ఐఆర్) పేరుతో అర్హులైన ఓటర్లను తొలగించే ప్రయత్నాలను అప్రమత్తంగా తిప్పికొట్టాలని కార్మిక, మైనింగ్, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని గద్దెరాగడి ఎంఎన్ఆర్ గార్డెన్స్‌లో బూత్ లెవల్ ఏజెంట్ల అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ, జహీరాబాద్ ఎంపి సురేష్ షట్కర్ పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ముసుగులో బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్ అనుకూల ఓటర్ల పేర్లను తొలగించేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బిఎల్ఎలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాలను పరిశీలించాలని, చనిపోయిన వారి వివరాలను గుర్తించి అధికారులకు తెలపాలని సూచించారు. గత బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తోందని, చెన్నూరులో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకే బిజెపి ప్రభుత్వం ఎస్ఐఆర్ ప్రక్రియతో ఓటర్ల తొలగింపుకు పాల్పడుతోందని, నీట్ పరీక్షల అవకతవకలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువత ఉపాధికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎరువుల ధరల పెంపుతో రైతులపై భారం

ధరలు తగ్గించకపోతే ఉద్యమాలు తప్పవు: దశరథ్



ప్రజాపక్షం / కొండాపూర్ : యూరియా ఎరువుల ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచడం వల్ల రైతులపై ఆదనపు భారం పడుతుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యవర్గ సభ్యుడు సి.హెచ్. దశరథ్ ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా బస్తాపై రూ. 300 నుంచి రూ. 500 వరకు ధర పెరగడం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. ఇప్పటికే డీజిల్ ధరలు , కూలీల వేతనాలు పెరగడంతో వ్యవసాయ ఖర్చులు భారీగా పెరిగాయని . దీనికి తోడు నకిలీ విత్తనాల కారణంగా ఆశించిన దిగుబడి రాక రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు ఏమి చేయాలో తెలియని ఆయోమయ పరిస్థితిలో మనోవేధనకు గురవుతున్నారని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఈ దయనీయ పరిస్థితికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలే ప్రధాన కారణమని నకిలీ విత్తనాలపై సరైన నియంత్రణ లేకపోవడం కూడా ఒక కారణమని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే పెంచిన ఎరువుల ధరలను, డీజిల్ ధరలను తగ్గించడంతో పాటు నకిలీ విత్తనా విక్రయాలను పూర్తిగా అరికట్టి రైతులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లాలోని రైతులందరినీ సమీకరించి పెద్ద ఎత్తున నిరనసలు ,ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.

## 28న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం

కలెక్టర్ కె. హరిత



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : జిల్లాలో ఈనెల 28న నిర్వహించబోయే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం, జులై 13న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా చేపట్టే మాత్రల పంపిణీని అత్యంత విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. కలెక్టరేట్ భవన సముదాయ సమావేశ మందిరంలో ముందస్తు ఏర్పాట్లపై శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు అందించాలని అన్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 46,516 మంది ఐదేళ్లలోపు పిల్లలు ఉన్నారని, వారి కోసం 670 వ్యాక్సినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రయాణాల్లో ఉండే పిల్లల కోసం బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో 18 మొబైల్ వ్యాక్సినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 28న పోలియో బూత్‌లలో చుక్కలు వేయించుకోలేకపోయిన పిల్లల కోసం, 29, 30 తేదీలలో వైద్య ఆరోగ్య సిబ్బంది నేరుగా ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలను వేస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు. జూలై 13న నిర్వహించబోయే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ఏడాది నుండి 19 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలు, యువత అందరికీ నులిపురుగుల నివారణ మాత్రలను అందించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఈ వయస్సు వర్గం వారు మొత్తం 1,67,702 మంది ఉన్నారని, వీరందరికీ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ నివారణ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులందరూ పరస్పర సమన్వయంతో పనిచేసి వంద శాతం విజయవంతం చేయాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల సహకారం తీసుకోవాలని, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో డప్పు చాటింపు, మైక్ అనౌన్స్‌మెంట్ల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సీతారాం, వివిధ సంబంధిత ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'బివిఐఆర్‌టి'లో సాంకేతికత వినియోగంపై సదస్సు



ప్రజాపక్షం/నర్సాపూర్: నర్సాపూర్ బి.వి. రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి 5వ ఐఇఇఇ వైర్‌లెస్, యాంటెన్నా అండ్ మైక్రోవేవ్ సింపోజియం (వామ్స్ 2026) రెండవ రోజు కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో భారతదేశంతో పాటు విదేశాల నుండి వచ్చిన పరిశోధకులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అమెరికా దేశానికి చెందిన ప్రొఫెసర్ ఫిల్ వెనిజియా, డా॥ సుధాకర్, కె.రావు, డా॥ సతీష్ శర్మ, డా॥ జావాద్, సిద్ధికి, కెనడా, ప్రొ. దేసోమందేసిమ్, తైవాన్ డా॥ సి.జె. రెడ్డి, ప్రొఫసర్ ఫ్రాన్సెస్కో పి.ఆండ్రియుల్లీ, ప్రొఫసర్ జవాద్ సిద్ధిఖీ, కెనడా, ప్రొఫసర్ డిబాతోష్ గుహా, కోల్‌కత్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఐఈఈఈ మానవ సంక్షేమం కోసం సాంకేతికత వినియోగం పై ప్రత్యేక ఆసక్తి కలిగించే యూవ విద్యార్థుల కార్యక్రమాన్ని నిర్వహించారు. తద్వారా విద్యార్థులలో సమానత్వాన్ని ప్రోత్సహించే అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలకు విశాఖపట్నంలోని డా. వేదుల సమీర్ చక్రవర్తి, బీవీఆర్ఐటీ నర్సాపూర్ చెందిన డా. జయశ్రీ దాస్, డా. సతీష్ రామా చౌదరి నాయకత్వం వహించారు. పాఠశాల విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, ఇంజినీరింగ్, ఆవిష్కరణలు, సామాజిక బాధ్యతలపై ఆసక్తిని పెంపొందించేందుకు ప్రత్యేకంగా ఈ కార్యక్రమాలను రూపొందించారు. ఈ కార్యక్రమం ద్వారా అంతరిక్ష సాంకేతికత, ఉపగ్రహాల వినియోగం, సైనిక మరియు రక్షణ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం, విద్యా, ఆరోగ్య రంగంలో ఆధునిక సాంకేతికతల పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ సంజయ్ దూబే విభాగాల అధిపతులు, అధ్యాపకులు అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ బి.బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ మల్లికార్జున్.విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 44వ జాతీయ రహదారిపై ఘోర రోడ్డుప్రమాదం

రెండు లారీలు ఢీకొని చెలరేగిన మంటలు

క్యాబిన్‌లోనే డ్రైవర్ సజీవ దహనం




ప్రజాపక్షం / నిర్మల్ : నిర్మల్ రూరల్ మండలం మెడిపల్లి గ్రామ సమీపంలో ని 44 జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రెండు లారీలు ఒకదానికొకటి బలంగా ఢీకొనడంతో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగి, ఒక లారీ డ్రైవర్ క్యాబిన్ లోపలే చిక్కుకుపోయి సజీవ దహనమయ్యాడు. ఈ ప్రమాదం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు మరియు స్థానికుల వివరాల ప్రకారం నాగ్‌పూర్ వైపు నుండి ఆలుగడ్డల లోడుతో హైదరాబాద్ వైపు వెళ్తున్న ఒక లారీ టైర్ హఠాత్తుగా పంచర్ అయింది. దీంతో డ్రైవర్ మేడిపల్లి గ్రామం వద్ద హైవే రోడ్డు పక్కన లారీని నిలిపి ఉంచాడు. సరిగ్గా అదే సమయంలో ఆదిలావాద్ జిల్లా నుండి జొన్నల లోడుతో హైదరాబాద్ వైపు అతివేగంగా వెళ్తున్న మరో లారీ రోడ్డు పక్కన ఆగి ఉన్న ఆలుగడ్డల లారీని వెనుక నుంచి అత్యంత వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు లారీలోని ఇంజిన్ భాగం దెబ్బతిని ఒక్కసారిగా భారీగా మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలో వెనుక నుంచి ఢీ కొట్టిన లారీ క్యాబిన్‌లోనే చిక్కుకుపోయిన ఆదిలాబాద్ జిల్లా సొనాల మండలానికి చెందిన డ్రైవర్ జవారి సింగ్ మంటల తీవ్రతకు బయటకు రాలేకపోయాడు. క్షణాల వ్యవధిలోనే మంటలు లారీ మొత్తానికి వ్యాపించడంతో ఆయన క్యాబిన్‌లోనే కాలి బూడిదై అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదం జరిగిన సమయంలో చెలరేగిన మంటలు, దట్టమైన పొగ కారణంగా జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ జానకీ షర్మిల స్థానిక పోలీసు అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి లారీ అవశేషాలను రోడ్డుపై నుండి తొలగించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## నగర ప్రజలకు మెరుగైన సేవలు

నిజామాబాద్ నగర మేయర్ కె. ఉమారాణి



ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : నిజామాబాద్ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో నిజామాబాద్ కార్పొరేషన్ ముందుంటుందని, నగర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేస్తున్నామని మేయర్ ఉమారాణి రమేష్ అన్నారు. గురువారం స్థానిక 47వ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, తాగునీటి సరఫరా, రోడ్ల సమస్యలపై క్షేత్రస్తాయిలో పర్యటించి పరిశీలించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాలను సందర్శించిన మేయర్ స్థానిక కాలనీ వాసులతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను తెలుసుకున్నారు. సమస్యలపై సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు చేపట్టి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఎంసి నజీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పేర్రాజు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహిపాల్, మున్సిపల్ జవాన్లు, స్థానికులు పాల్గొన్నారు.

## మెదక్ ఖిల్లాకు దేశస్థాయిలో గుర్తింపునకు కృషి

ప్రత్యేక నిధులతో ఖిల్లా అభివృద్ధి

కలెక్టర్ ప్రతిమా సింగ్



ప్రజాపక్షం/మెదక్ : మెదక్ ఖిల్లాకు దేశ స్థాయిలో గుర్తింపునకు కృషి చేయాలని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్ సహకారంతో మెదక్ ఖిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి రాష్ట్ర, దేశ స్థాయిలో ముందు ఉంచుతామని దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీఓ రమాదేవి, మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్ బట్టి ఉదయ్ కుమార్, కమిషనర్ నవీన్ ఇతర అధికారులతో కలిసి మెదక్ ఖిల్లాను సందర్శించారు. మెదక్ ఖిల్లపైన ఉన్న గజశాల, దర్వాజాలు, జైలును తదితర చరిత్రక అంశాలను కలెక్టర్ ప్రతిమా సింగ్ అడిగి తెలుసుకున్నారు. మెదక్ ఖిల్ల పైన ఎక్కడ డ్యామేజ్ అయింది, ఎక్కడ శిథిలావస్థకు చేరింది అనే అంశాలను కలెక్టర్ క్షుణంగా పరిశీలించారు. ఖిల్లా పైన అడ్డదిడ్డంగా పెరిగిన చెట్ల మొక్కలను, ముళ్ల పొదలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లాలో దొరికిన పురావస్తు విగ్రహాలు, తదితర శాసనాలు, వివిధ అంశాలతో ఖిల్లాపై మ్యూజియంను ఏర్పాటు చేసి మెదక్ జిల్లా చరిత్రను చెప్పే విధంగా పర్యాటకులకు అందుబాటులో ఉంచుతామన్నారు. జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక స్కీం కింద నిధులు తీసుకొచ్చి జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మెదక్ ఖిల్లాపై లెదర్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో ఖిల్లాపై సాంస్కృతిక కార్యక్రమాలు చేయడానికి అనువైన ప్రదేశమని కొనియాడారు. మెదక్ జిల్లా హైదరాబాద్ కు దగ్గరగా ఉన్నటువంటి నేపథ్యంలో పర్యాటక ప్రాంతాలను గుర్తించి మరింత అభివృద్ధి చేస్తామని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ రామచంద్ర రాజు, నాయకులు భూపతి రాజు, ఇప్ప భరత్, నవీన్ కుమార్ తో పాటు తదితరులు ఉన్నారు.

## ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వినియోగంపై అవగాహన



ప్రజాపక్షం / సంగారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సంగారెడ్డి ప్రాంతీయ కార్యాలయం తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంగారెడ్డి సహకారంతో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాల కల్ల కలిగే దుష్ప్రబావాలు, పర్యావరణ పరిరక్షణ అవసరం, పర్యావరణహిత ప్రత్యామ్నాయాల వినియోగం వంటి అంశాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గుండ్ల మాచునూర్ గ్రామంలో ప్లాస్టిక్ రహిత పర్యావరణం కోసం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా ప్లాస్టిక్ కాలుష్యం వల్ల కలిగే పర్యావరణ నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని పిలుపు నిచ్చారు. వివిధ ప్రాంతాలలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కార్యక్రమాలు చేపట్టబడ్డాయి. సంగారెడ్డి పట్టణంలోని పలు ప్రాంతాలలో పరిశ్రమల ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగించగల పర్యావరణ హిత ఉత్పత్తుల ప్రదర్శన స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో వస్త్ర సంచులు స్టీల్ పాత్రలు , గాజు సీసాలు, జీవాక్షేయ ఉత్పత్తు ,ఇతర పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను ప్రదర్శించారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ,సిబ్బందికి వస్త్ర సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు , పరిశ్రమల ప్రతినిదులు ,ప్రజల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి స్థిరమైన పర్యావరణ హిత జీవన విధానాలను అవలంభించాలనే అవగాహన పెంపొందించారు.

# లేఅవుట్ ఓపెన్ స్పేస్‌లలో నిర్మాణాలు చేపట్టొద్దు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

బడులు, అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నిజామాబాద్ :లే అవుట్ ప్లాట్లకు సంబంధించిన ఓపెన్ స్పేస్‌లలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఎలాంటి నిర్మాణాలకు అనుమతి లేదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. నిబంధనలను అతిక్రమిస్తూ ఎవరైనా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్‌లో గురువారం మండల పంచాయతీ పంచాయతీ అధికారులతో కలెక్టర సమీక్ష నిర్వహించారు. లే అవుట్లలో ప్రజా అవసరాల కోసం 10 శాతం మేరకు కేటాయించబడిన ఓపెన్ స్పేస్‌లు, పార్కులు, ఇతర సామూహిక వినియోగ స్థలాలను పరిరక్షించడం అధికారులు, స్థానిక సంస్థల బాధ్యత అని కలెక్టర్ గుర్తు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ ప్రాంతాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా వాటిని వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలుచోట్ల ఓపెన్ స్పేస్‌లలో నిర్మాణాలు జరుగుతున్నాయని తనకు ఫిర్యాదులు వస్తున్నాయని, సంబంధిత ఎంపిఓలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న దృష్ట్యా జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పాములు, తేళ్లు, ఇతర విష కీటకాల బారిన పడి విద్యార్థులు ప్రమాదాలకు లోను కాకుండా బడులు, అంగన్‌వాడీ సెంటర్ల పరిసరాలలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదల వంటివి ఉన్నట్లయితే వెంటనే వాటి ని శుభ్రం చేయించాలన్నారు. సర్పంచ్‌లు, ఇత ర ప్రజాప్రతినిధులను ప్రజలను భాగస్వాములు చేస్తూ అవసరమైతే శ్రమదానం చేపట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, ఎంపీఓలు పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు తప్పనిసరి

వ్యవసాయ విస్తరణ అధికారి రాజశేఖర్




ప్రజాపక్షం / మందమర్రి : ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడానికి ప్రతి అర్హ రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని మందమర్రి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి రాజశేఖర్ పిలుపునిచ్చారు. పట్టా పాసుపుస్తకాలు కలిగిన రైతులందరూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో రైతులకు అందించే ఆర్థిక సహాయాలు, సబ్సిడీలు, పంట రుణాలు, పంట బీమా వంటి పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రీ కీలక ఆధారంగా మారనుందని తెలిపారు. నమోదు పూర్తయిన రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య (ఫార్మర్ ఐడీ) లభిస్తుందని, ఇది అన్ని ప్రభుత్వ లావాదేవీలకు ఉపయోగపడుతుందని వివరించారు. రైతులు తమ ఆధార్ కార్డు, పట్టా పాసుపుస్తకం, మొబైల్ నంబర్ పత్రాలతో సమీప వ్యవసాయ కార్యాలయంలో వెంటనే నమోదు పూర్తి చేసుకోవాలని కోరారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు.

